

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 26.2 కనిష్ఠం 22.8



సచివాలయంలో మంత్రి సీతక్క, ఉద్యోగుల బతుకమ్మ సంబురం

కోఠీ ఉమెన్స్ కళాశాలలో ఆట పాట..

భక్తి శ్రద్ధలతో...

నగరంలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలతో పాటుగా వాడవాడలా బతుకమ్మలను అందంగా తీర్చిదిద్ది భక్తిశ్రద్ధలతో పూజలు చేసి నిమజ్జనం చేస్తున్నారు. గురువారం రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క పాల్గొని ఆడిపాడారు. అలాగే, రాష్ట్ర సచివాలయం ఆవరణ, కోఠీ ఉమెన్స్ కళాశాల, రవీంద్రభారతి తదితర ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో ఉద్యోగులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

- ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్



దేవీ వైభవం..



దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయంలో నిర్వహించిన అమ్మవారి మహా హారతి కార్యక్రమంలో భారీగా భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. కాగా, ఇసామియా బజార్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం ఎదుట భక్తులను ఆకట్టుకుంది.

- చార్మినార్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి)

కదలిక ఏది..?

సీఎం చెప్పినా.. కర్ణన్ హెచ్చరించినా ముందుకు సాగని హెచ్-సిటీ ప్రాజెక్టులు

- ఏజెన్సీలను ఎంపిక చేసి నెలలు అయినా పనులు ప్రారంభం కాని వైనం
- ఇంజనీరింగ్ ప్రాజెక్టుల విభాగం నిర్లక్ష్యం
- క్షేత్రస్థాయిలో పరిస్థితులు పట్టని వైనం
- రూ.2,038 కోట్ల పనులకు ఇప్పటికే టెండర్



నల్గొండ ఎక్స్‌రోడ్స్ నుంచి ఒవైసీ కూడలి వరకు నిర్మాణంలోని స్టీల్‌బ్రిడ్జి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పనులు వేగవంతం చేయాలని పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు, నెలరోజుల వ్యవధిలోనే రెండు పర్యాయాలు సమీక్ష చేసి హెచ్చరించిన కమిషనర్ ఆర్‌వీ కర్ణన్.. అయినా జీహెచ్ఎంసీలోని ఇంజనీరింగ్ ప్రాజెక్టుల విభాగం అధికారుల తీరు మారడం లేదు. టెండర్లు పిలిచి, ఒప్పందాలు కుదుర్చుకోవడంపై శ్రద్ధ చూపుతున్న అధికారులు.. క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించడంపై మాత్రం శ్రద్ధ కనబర్చడం లేదు. ఈ విషయాన్ని గుర్తించిన కమిషనర్ కర్ణన్ ఇటీవలి కాలంలో సమీక్షలు నిర్వహించడమే కాక, క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యటిస్తూ ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. భూసేకరణ సమస్య పరిష్కారానికి యజమానులను ఒప్పిస్తున్నారు.

ఏజెన్సీలు ఎంపికైనా

మహానగరంలో ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టేలా రూ.7032 కోట్లతో హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ) ప్రాజెక్టులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూ.2,308 కోట్లతో వివిధ ప్రాంతాల్లో నిర్మించనున్న వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయింది. రూ.56 కోట్లతో

మిగతా 6వ పేజీలో..



చెప్పినట్లు వినకపోతే

చంపేస్తా..!

వైద్యుడికి గే బెదిరింపులు

- డేటింగ్ యాప్‌లో పరిచయం
- శారీరకంగా కలవాలని ఒత్తిడి, ఆపై దాడి
- డబ్బులు ఇవ్వాలంటూ వేధింపులు

హైటెక్ సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): డేటింగ్ యాప్‌లో పరిచయమైన వ్యక్తి (గే)తాను చెప్పినట్లు వినకపోతే చంపేస్తానంటూ ఓ వైద్యుడిని బెదిరించాడు. ఈ సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసు ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డేటింగ్ యాప్‌లో వైద్యుడితో ఓ వ్యక్తి (గే) కలిగిన తేరాల శరణ్ భగవాన్‌రెడ్డికి పరిచయం ఏర్పడింది. వారం రోజులుగా ఇద్దరూ యాప్ ద్వారా చాటింగ్ చేసుకుంటున్నారు. అయితే, మనం కలుద్దామంటూ వైద్యుడిని ఈనెల 21న

మిగతా 6వ పేజీలో..

దశ.. దిశ మారనున్న మెట్రో

ప్రాజెక్టు నుంచి తప్పుకున్న ఎల్అండ్‌టీ

- అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్ఠలు.. 8 ఏళ్లకే వెనక్కి
- సంస్థను దెబ్బతీసిన కొవిడ్.
- అప్పుల ఊబినుంచి బయట పడలేక సతమతం..
- మెట్రోతో ముగిసిన ఎల్అండ్‌టీ ప్రయాణం



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరంలో ఎల్అండ్‌టీ మెట్రో కథ ముగిసింది. ఎన్నో సవాళ్లను దాటుకుని, ప్రతిష్ఠాత్మకంగా దేశంలోనే తొలిసారిగా పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో మెట్రోను నిర్మించిన సంస్థ ఇకపై మెట్రో కార్యకలాపాలకు దూరం కానుంది. ఇకపై ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మెట్రో ప్రాజెక్టు కొత్త పుంతలు తొక్కనుంది.

2010లో ప్రస్థానం ప్రారంభం..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది. మొదట్లో సత్యం కంప్యూటర్స్‌కు అనుబంధ సంస్థగా ఉన్న మేటాస్ ఇన్‌ఫ్రా కంపెనీ మెట్రో రైలు ప్రాజెక్టును చేపట్టేందుకు 2008లోనే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే, సత్యం కంప్యూటర్స్ సంక్షోభంతో ఆ ప్రతిపాదన అర్ధాంతరంగా ఆగిపోయింది. అనంతరం ఎల్అండ్‌టీ సంస్థతో 2010 సెప్టెంబర్ 4న అప్పటి ప్రభుత్వం పీపీపీ విధానంలో మెట్రో రైలు ప్రాజెక్టును చేపట్టేందుకు కన్సెషన్ అగ్రిమెంట్‌ను కుదుర్చుకుంది. దీంతో ఇది దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అతి పెద్ద పీపీపీ ప్రాజెక్టుగా రికార్డుల్లోకి ఎక్కింది.

2017లో మెట్రో సేవలు ప్రారంభం..

హైదరాబాద్ మెట్రోరైలు మొదటి దశ సేవలను 2017 నవంబర్ 29న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. నాటినుంచి దశలవారీగా మూడు కారిడార్లలో మొత్తం 69 కి.మీ. మేరకు

మిగతా 8వ పేజీలో..



చిరుజల్లులతో తడిసి ఆహ్లాదకరంగా కనిపిస్తున్న ట్యాంక్‌బండ్

నగరంలో శీతలగాలులు

● పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్ తీరం సమీపంలో కేంద్రీకృతమై ఉన్న అల్పపీడనం బలహీనపడి ఉపరితల ఆవర్తనంగా కొనసాగుతుండడంతో నగరంలో గురువారం వాతావరణం పూర్తిగా మారిపోయింది. గురువారం ఉదయం నుంచే చల్లదనంతోపాటు శీతలగాలులు వీయడంతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యవసర పనులకు తప్ప.. ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు చాలామంది వెనకంజ వేశారు. కాగా, సాయంత్రం 5 గంటల సమయంలో పలు ప్రాంతాల్లో చిరుజల్లులు, మోస్తరు వర్షం కురిసింది. చల్లదనం, శీతలగాలుల కారణంగా ప్రధాన మార్గాల్లో రద్దీ తక్కువగానే కనిపించింది. రాగల రెండు, మూడు రోజులపాటు నగరంలో చల్లదనంతోపాటు మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

నేడు ఆరు ఎస్టీపీలు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మూసీనది పునరుజ్జీవం చేయడం, నగరంలో వంద శాతం మురుగు నీరు శుద్ధి చేయడం లక్ష్యంగా నిర్మించనున్న 39ఎస్టీపీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. అంబర్‌పేట ఎస్టీపీతో పాటు మరో ఐదు ఎస్టీపీలను సీఎం ప్రారంభించనున్నారు. మూసీనదిలో మురుగు చేరకుండా, చెరువులు, కుంటలు కలుషితమవ్వకుండా అమృత్ -2.0 కింద 39 ఎస్టీపీలు (972 ఎంఎల్‌డీల) మంజూరయ్యాయి. వీటిని 2026 వరకు పూర్తి చేయాలని లక్ష్యాన్ని విధించుకున్నారు. ఇప్పటికే మూసీనది వెంట అంబర్‌పేట, అత్తాపూర్, నాగోల్ తదితర ప్రాంతాల్లో ఎస్టీపీలు ఉండగా, నార్సింగ్, సంగం బాపూఘాట్, హైదర్షాకోట్, నల్లచెరువు, పీర్జాదిగూడ, కొర్రేములలో సరికొత్తగా ఎస్టీపీల నిర్మాణానికి చర్యలు చేపట్టారు.



అంబర్‌పేట ఎస్టీపీ

ఎస్ఆర్ నగర్‌లో ప్రైవేట్ బస్సు దగ్ధం



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ నగర్ మెట్రోస్టేషన్ వద్ద ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైంది. కూకట్‌పల్లి నుంచి రాజమండ్రికి 20 మందితో రాత్రి 11.30 గంటలకు బస్సు బయలు దేరింది. ఎస్ఆర్‌నగర్ మెట్రోస్టేషన్ దగ్గరకు వచ్చేసరికి బస్సులోని ఏసీ ఆగిపోయి పొగ వ్యాపించింది. దీంతో ప్రయాణికులు కిందకు దిగారు. బస్సు ముందు టైరు నుంచి మంటలు మొదలయ్యాయి. స్థానికంగా విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు గమనించి, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు మెట్రోస్టేషన్ కింద ఉన్న నీటి మోటర్‌ను ఆన్ చేయించి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎవరికీ ప్రాణనష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.

మూసీ వెంట ట్రంకులైన్లు

● రూ.4,700కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): మూసీనదిలో చుక్క మురుగునీరు కూడా చేరకుండా ట్రంక్‌లైన్లను నిర్మించేందుకు వాటర్‌బోర్డు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మురుగు పూర్తిగా ట్రంక్‌లైన్లలో చేరేలా చర్యలు చేపడుతూ, వీటిని ఎస్టీపీలకు మళ్లించేలా చర్యలు తీసుకోనుంది. దీంతో మూసీనదిలో మురుగునీరు చుక్క కూడా కలవదని, స్వచ్ఛమైన గోదావరి జలాలను మూసీనదిలో ప్రవహింపజేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. అందులో భాగంగా పశ్చిమాన ఔటర్ రింగ్‌రోడ్డు (నార్సింగి) నుంచి తూర్పున ఔటర్ రింగ్‌రోడ్డు (గౌరెల్లి)వరకు మూసీనది వెంట ట్రంక్‌లైన్ల నిర్మాణానికి రూ.4,700కోట్ల అంచనా వ్యయంతో చేసిన ప్రతిపాదనలను వాటర్‌బోర్డు ఇటీవల ప్రభుత్వానికి అందజేసింది. ఈ ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేయగానే టెండర్ ప్రక్రియను చేపట్టనున్నారు.

నిన్నటి వరకు ఉద్యోగులు..
నేటి నుంచి అధికారులు

గ్రూప్-1కు ఎంపికైన ముగ్గురు జేఎన్‌టీయూ ఉద్యోగులు

డీఎస్పీ పోస్టుకు మెటలర్జికల్ ఇంజనీరింగ్ విభాగం పూర్వ విద్యార్థి



గోపిశెట్టి సుస్మిత



యరవా కావ్యారెడ్డి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో నిన్నటి వరకు సాధారణ ఉద్యోగులుగా ఉన్న ముగ్గురు యువతులు, నేటి నుంచి గ్రూప్-1 అధికారులుగా పరిపాలనలో తమ సత్తా చాటబోతున్నారు. ఇంతకు మునుపు గ్రూప్-4 పరీక్షలో ఎంపికై గత డిసెంబరు నుంచి జేఎన్‌టీయూలోని వివిధ విభాగాల్లో వారంతా జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నారు. క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజీ పరీక్షల విభాగంలో పనిచేస్తున్న గోపిశెట్టి సుస్మిత.. రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో) పోస్టుకు ఎంపిక కాగా, అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న యరవా కావ్యారెడ్డి రాష్ట్ర ఆడిట్ విభాగంలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ (ఏఏఓ) పోస్టును దక్కించుకున్నారు. అలాగే, అకడమిక్ అండ్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న పద్మప్రియకు కమర్షియల్ ట్యాక్స్ విభాగంలో అధికారి పోస్టు లభించింది. మరోవైపు జేఎన్‌టీయూ మెటలర్జికల్ ఇంజనీరింగ్ (2018-22) పూర్వ విద్యార్థి పత్తిపాటి సందీప్‌కుమార్ డీఎస్పీ పోస్టుకు ఎంపిక కావడం విశేషం. జేఎన్‌టీయూలోని వివిధ విభాగాల్లో గ్రూప్4 ఉద్యోగి స్థాయి నుంచి రాష్ట్రంలోని పరిపాలనా కార్యాలయాలకు గ్రూప్ 1 ఆఫీసర్లుగా వెళుతున్న ముగ్గురు యువతులకు యూనివర్సిటీ

మిగతా 8వ పేజీలో..

కోచింగ్ లేకుండా కష్టపడి చదివి.. 6



కొత్త కనెక్షన్ల దరఖాస్తులను

పరిష్కరించండి

అధికారులకు డిస్కం సీఎండీ ఆదేశం 6



ఐక్యతకు చిహ్నంగా

మహా చింతచెట్టు

ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్ అధ్యక్షుడు వేదకుమార్ 6

వృద్ధులే టార్గెట్..



పెరుగుతున్న డిజిటల్ అరెస్టు మోసాలు

- వారంలో రూ. 2.46 కోట్లు కొల్లగొట్టిన క్రిమినల్స్
- ఇప్పటికే ఒకరు గుండెపోటుతో మృతి
- మానసికంగా కుంగిపోతున్న వయోధికులు

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల అరాచకాలు రోజురోజుకూ పరాకాష్ఠకు చేరుతున్నాయి. ప్రజల అమాయకత్వాన్ని, భయాన్ని అత్యాశను ఆసరాగా చేసుకుంటున్న క్రిమినల్స్.. కొత్తకొత్త ఎత్తుగడలతో రూ. కోట్లు కొల్లగొడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులను టార్గెట్ చేస్తూ డిజిటల్ అరెస్టు పేరుతో వారిని భయభ్రాంతులకు గురిచేసి ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. జీవితాంతం కష్టపడి సంపాదించుకున్న డబ్బును గద్దల్లా తన్నుకుపోయి, రోడ్డున పడేస్తున్నారు. వారం రోజుల్లో నలుగురిని మోసం చేసిన క్రిమినల్స్.. రూ.2.46కోట్లు కొల్లగొట్టారు. జీవితాంతం కష్టపడి పోగుచేసుకున్న డబ్బు నిమిషాల్లో కాజేస్తుండడంతో వారు మానసికంగా కుమిలిపోతున్నారు. ఇప్పటికే ఓ రిటైర్డ్ మహిళా డాక్టర్ గుండెపోటుతో మృతి చెందగా.. మరికొంత మంది మానసికంగా కుంగిపోతున్నట్లు సైబర్ క్రైమ్ డీసీపీ ధార కవిత తెలిపారు.

83 ఏళ్ల వృద్ధుడి నుంచి 80.64 లక్షలు..

హబ్సిగూడకు చెందిన 83 ఏళ్ల రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగిని మోసం చేసిన సైబర్ క్రిమినల్స్.. డిజిటల్ అరెస్టు పేరుతో

మిగతా 6వ పేజీలో..

ఫిర్యాదు చేయాల్సిన నంబర్లు

డయల్-100

సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్ 1930

డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ. 1.38 కోట్లు

సికింద్రాబాద్‌కు చెందిన 65 ఏళ్ల వృద్ధుడిని డిజిటల్ అరెస్టు పేరుతో భయపెట్టి, బెదిరించిన సైబర్ క్రిమినల్స్ ఆయన వద్ద నుంచి ఇటీవల రూ.కోటీ 38లక్షల 43వేల 952 కొల్లగొట్టారు. కష్టపడి సంపాదించుకున్న డబ్బును క్షణాల్లో కోల్పోవడంతో బాధితుడు దిక్కుతోచని స్థితిలో సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

డిజిటల్ అరెస్టు అనేది ఒక అబద్ధం



డిజిటల్ అరెస్టు అనేది ఒక అబద్ధం. పోలీసులు ఎప్పుడూ అలాంటి అరెస్టులు చేయరని గుర్తించాలి. ఎవరైనా అలా బెదిరించినా, డబ్బులు బదిలీ చేయాలని అడిగినా వెంటనే కాల్ కట్ చేయండి. మళ్లీ ఫోన్ చేస్తే లోకల్ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించండి. సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయండి. లేదా డయల్-100కు ఫోన్ చేసి చెప్పండి.

- సీపీ ఆనంద్, పోలీస్ కమిషనర్, హైదరాబాద్



జీవితకాల ర్యాంకింగ్స్‌లో ఎంపికైన ఎల్వీపీ-ఈఐ వైద్యులు

స్టాన్‌ఫోర్డ్ పరిశోధకుల జాబితాలో ఇద్దరు హైదరాబాద్ నేత్ర వైద్యులు

● జీవిత కాలం ర్యాంకింగ్‌లో ఏడుగురు ఎల్వీ ప్రసాద్ వైద్యులు



డాక్టర్ సంతోష్ జి.హోనవార్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక స్టాన్‌ఫోర్డ్ విశ్వ విద్యాలయం, ఎల్సెవియర్ నిపుణులు సంయుక్తంగా ఏటా నిర్వహించే ప్రతిభావంతులైన శాస్త్రవేత్తల జాబితాలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు నేత్ర వైద్యులు అగ్రస్థానాల్లో నిలిచారు. 2025 సంవత్సరానికి గాను.. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సంతోష్ జి.హోనావర్, ఎల్వీ ప్రసాద్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గుళ్లపల్లి ఎన్ రావు అప్తల్మాలజీ పరిశోధకుల జాబితాలో మొదటి రెండు స్థానాల్లో ఉన్నారు. నగరంలోని సెంటర్ ఫర్ సైట్ ఐ హాస్పిటల్‌లో ఆప్తాల్మిక్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ సంతోష్ జి.హోనవార్ భారత్ నుంచి అగ్రశ్రేణి నేత్ర వైద్యుడిగా వరుసగా ఐదోసారి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఏడుగురు ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యులు జీవిత కాల ర్యాంకింగ్‌లో చోటు దక్కించుకోగా.. మరో 15మంది వార్షిక ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్నట్లు ఆస్పత్రి యాజమాన్యం పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన రెండు శాతం పరిశోధకుల జాబితాలో 61 మంది భారతీయ నేత్ర వైద్య శాస్త్రవేత్తలు వార్షిక ర్యాంకింగ్స్‌లో స్థానం సంపాదించుకున్నారు.

30న అంబేడ్కర్ వర్సిటీ 26వ స్నాతకోత్సవం

● గోరటి వెంకన్న, ప్రేమ్ రావత్‌లకు గౌరవ డాక్టరేట్లు

● ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి



స్నాతకోత్సవం వివరాలు వెల్లడిస్తున్న వీసీ ఘంటా చక్రపాణి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం 26వ స్నాతకోత్సవాన్ని ఈనెల 30న నిర్వహించనున్నట్లు ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి తెలిపారు. యూనివర్సిటీ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రిజిస్ట్రార్ డా. ఎల్.విజయకృష్ణా రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొ. బోజు శ్రీనివాస్‌తో కలిసి వీసీ వివరాలు వెల్లడించారు. స్నాతకోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో పాటు ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో) న్యూఢిల్లీ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమా కాంజీలాల్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ స్నాతకోత్సవంలో తెలుగు సాహిత్యం వ్యాప్తికి చేసిన సేవలకు గాను ప్రఖ్యాత కవి, గేయ రచయిత గోరటి వెంకన్నకు గౌరవ డాక్టరేట్, ప్రముఖ రచయిత, ప్రఖ్యాత విద్యావేత్త ప్రేమ్ రావత్‌కు డాక్టర్ ఆఫ్ లెటర్స్(హానరిస్ కాసా గౌరవ డాక్టరేట్)తో సత్కరించబోతునున్నట్లు ఆయన తెలిపారు. ఎంఫిల్, పీహెచ్‌డీ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి బంగారు పతకాలు, బుక్‌ప్రైజ్‌లను అందిస్తామని తెలిపారు. అండర్ గ్రాడ్యుయేట్ విభాగంలో 35 బంగారు పతకాలు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విభాగంలో 51 మొత్తం 86 బంగారు పతకాలు అందిస్తామని పేర్కొన్నారు. వివిధ జైళ్ల నుంచి చదువుకుంటున్న 203 మంది ఖైదీలకు డిగ్రీ పట్టాలు అందజేస్తామని, వీరిలో ఇద్దరికి బంగారు పతకాలు, బుక్ ప్రైజులు అందజేస్తామని ఆయన తెలిపారు.

'ఆకాష్' మన శాస్త్రవిజ్ఞాన సామర్థ్యానికి ప్రతీక



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త ప్రహ్లాద రామారావు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆకాష్ అనేది కేవలం ఓ మిస్సైల్ మాత్రమే కాదు, ఇది భారతీయ శాస్త్ర విజ్ఞాన సామర్థ్యం, పరిశ్రమ భాగస్వామ్యం, జాతీయ సంకల్పానికి ప్రతీక అని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఆకాష్ మిస్సైల్ రూపకర్త, డాక్టర్ ప్రహ్లాద రామారావు అన్నారు. హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఏ) రెడ్‌హిల్స్‌లోని కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో 'వికసిత్ భారత్‌కు రెండు మూల స్తంభాలు- బలమైన రక్షణ, ఆత్మనిర్భరత' అనే అంశంపై ఆయన ప్రత్యేకంగా ఉపన్యసించారు. ఆకాష్ రూపకల్పనలో 95శాతం దేశీయంగా తయారైన సిస్టమ్స్‌నే వాడుకున్నామని, దీంతో దేశానికి భారీగా ఆర్థిక లబ్ధి కలిగించడంతో పాటుగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడ్డాయన్నారు. ఆకాష్ టీమ్ పరిశోధన, అభివృద్ధి ప్రయత్నాల కారణంగానే ఆర్ అండ్ డీ పై మనం పెట్టిన పెట్టుబడులకు దాదాపు 60 రెట్ల రాబడిని చూస్తున్నామన్నారు. అంతేకాకుండా దాదాపు 60వేల కోట్ల విదేశీమారక ద్రవ్యంను కూడా ఆదా చేసుకోగలిగామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఏ) అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు శరత్ చంద్ర మారోజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులే టార్గెట్..

(5వ పేజీ తరువాయి)

భయపెట్టి రూ. 80.64లక్షలు కొల్లగొట్టారు. ట్రాయ్ ఉద్యోగిగా పరిచయం చేసుకున్న గుర్తుతెలియని వ్యక్తి.. మీపై మానవ అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయని బెదిరించాడు. ఆ తర్వాత వీడియోకాల్ చేసిన వ్యక్తులు సీబీఐ అధికారుల్లా పోలీస్ డ్రసుల్లో కనిపించి, సుప్రీం కోర్టు నుంచి అరెస్టు వారెంట్ ఇష్యూ అయిందని చూపించి డిజిటల్ అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. మీ ఖాతాలోని డబ్బంతా ఆర్‌బీఐకి పంపాలని క్లియరెన్స్ వచ్చేంత వరకు ఎవరికీ విషయం చెప్పొద్దని బెదిరించారు. అలా భయపెట్టి రూ. 80.64లక్షలు కొల్లగొట్టారు. జీవితాంతం కష్టపడి సంపాదించుకున్న డబ్బును సైబర్ క్రిమినల్స్ దోచుకోవడంతో ఆయన తీవ్ర మానసిక వేదనకు గురైనట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో మృతి చెందిన విశ్రాంత డాక్టర్

ఇటీవల సైబర్ క్రిమినల్స్ చేతికి చిక్కి డిజిటల్ అరెస్టుకు గురైన 75ఏళ్ల విశ్రాంత మహిళా డాక్టర్ మానసిక వేదనతో గుండెపోటుతో మృతిచెందారు. తాను రూ.6.60లక్షలు పోగొట్టుకున్న విషయం కుటుంబ సభ్యులకు చెప్పుకోలేక లోలోపల కుమిలిపోయి హార్ట్‌ఎటాక్ వచ్చి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆలస్యంగా గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె మృతి చెందిన తర్వాత కూడా సైబర్ క్రిమినల్స్ నుంచి వేధింపుల మెసేజ్ రావడం గమనార్హం.

చెప్పినట్లు వినకపోతే చంపేస్తా..!

(5వ పేజీ తరువాయి)

మాదాపూర్‌లోని ఓ హాస్టల్‌కు రమ్మని భగవాన్‌రెడ్డి ఆహ్వానించాడు. అక్కడికి వెళ్లిన వైద్యుడిపై భగవాన్‌రెడ్డి అనుచితంగా ప్రవర్తించాడు. అందుకు వైద్యుడు అంగీకరించలేదు. దాంతో వైద్యుడిపై అతను దాడి చేశాడు. నీ విషయం కుటుంబ సభ్యులకు, ఆస్పత్రిలో చెబుతానంటూ హెచ్చరించాడు. అంతేకాకుండా తాను చెప్పినట్టు వినకపోతే చంపేస్తానంటూ బెదిరించాడు. దాంతో భయపడిన వైద్యుడు పేటీఎం ద్వారా రూ.5వేలు పంపించాడు. అంతటితో సంతృప్తి చెందని అతను వైద్యుడి ఫోన్ లాక్కుని ఆస్పత్రి వరకు అతన్ని వెంబడించాడు. అతని ఫ్లాట్‌కు వెళ్లి వైద్యుడి వాలెట్లో ఉన్న రూ.3 వేలు తీసుకున్నాడు. మరిన్ని డబ్బులు ఇవ్వాలని వేధిస్తూ ఇబ్బందులకు గురిచేశాడు. బాధితుడు ఈ నెల 22న ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు ఫిర్యాదు చేయగా.. వారు మాదాపూర్ పోలీసులకు కేసును బదిలీ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఓజీ.. క్రేజ్

● ఫ్యాన్స్ హంగామా

ఖైరతాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు పవన్‌కళ్యాణ్ ఓజీ సినిమా విడుదల నేపథ్యంలో ఆయన అభిమానులు సందడి చేస్తున్నారు. థియేటర్లలో హంగామా చేశారు. కొందరు తమ టీషర్టులను చింపుకొని పవర్‌స్టార్ తమ హృదయంలో ఉన్నాడనే సంకేతాలివ్వడంతో మరికొందరు దాన్నే అనుసరిస్తూ కనిపించారు. దీంతో ఐమాక్స్ మల్టీప్లెక్స్ యాజమాన్యం సినిమా చూసేవారు టీషర్టు వేసుకుని వస్తే మరొక టీషర్టు అదనంగా తెచ్చుకోవాలని చమత్కరిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టడంతో అది కాస్తా వైరల్‌గా మారింది.

గ్రూప్స్ సిలబస్‌పై స్పష్టత ఇవ్వండి



గ్రూప్స్ సిలబస్ కమిటీ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న మానవతారాయ్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ గ్రూప్స్ పోటీ పరీక్షల సిలబస్‌లో మార్పు చేర్పులపై నిరుద్యోగులకు స్పష్టతనివ్వాలని తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ కోరారు. ఈ మేరకు గురువారం తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్, సిలబస్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణా రెడ్డిని మానవతారాయ్ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయనతో పాటు ఓయూ నేతలు భీమ్‌రావునాయక్, బండి నరేష్, హేమంత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మిరాజ్ సినిమాస్, ఆనంద్ మాల్ ప్రారంభం



మిరాజ్ సినిమాస్‌ను ప్రారంభిస్తున్న ఆర్.నారాయణమూర్తి తదితరులు

నార్సింగ్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మీరాజ్ సినిమాస్, ఆనంద్ మాల్‌ను ప్రముఖ సినీ నటుడు, డైరెక్టర్ ఆర్.నారాయణమూర్తి, నిర్మాత దిల్ రాజ్, మైహోం గ్రూప్ చైర్మన్ జె.రామేశ్వరరావుతో కలిసి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

కింగ్‌కోఠి ఆస్పత్రిలో బాల భీముడు జననం



5కిలోల బరువు జన్మించిన బాలుడు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కింగ్ కోఠి ప్రభుత్వ ఆస్పత్రిలో బాల భీముడు జన్మించాడు. పురిటి నొప్పులతో అడ్మిట్ అయిన గర్భిణికి ఆస్పత్రి వైద్యులు బుధవారం అర్ధరాత్రి 2.18 గంటలకు సాధారణ ప్రసవం చేశారు. మారేడ్‌పల్లిలోని ఆర్యా నగర్ నివాసి నూరియన్ సిద్దిక్యూ(23) గర్భం దాల్చడంతో ఆమె ఆస్పత్రిలో మాత శిశుసంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)లోని గైనాకాలజీ డాక్టర్ జ్యోతిర్మయి పరిశీలనలో వైద్యం చేయించుకున్నారు. ఆమెకు నొప్పులు రావడంతో ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని వైద్య సేవలు అందించగా సాధరణ ప్రసవం కావడంతో పాటు 5కిలోల బరువు గల మగశిశువు జన్మించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్‌బాబు, ఆర్ఎంఓ డాక్టర్ సాధన తెలిపారు. 39 వారాలకు ఆమె ప్రసవించారని తెలిపారు. కింగ్ కోఠి ఆస్పత్రిలో 5 కిలోల శిశువు జన్మించడం ఇదే మొదటి సారని డాక్టర్ సంతోష్ బాబు చెప్పారు. తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

కదలిక ఏది..?

(5వ పేజీ తరువాయి)

కూకట్‌పల్లిలోని ఫాక్స్ సాగర్ నాలాపై బ్రిడ్జి మినహా ఇతర ప్రాజెక్టుల పనులు ఇప్పటికీ మొదలు కాలేదు. కేబీఆర్ పార్కు చుట్టూ జంక్షన్లలో వంతెనలు, అండర్‌పాస్ పనులకు ఏజెన్సీ ఎంపికై రెండు నెలలు దాటింది. ఏకో సెన్సిటివ్ జోన్ దెబ్బతింటుందన్న కేసు కోర్టు విచారణలో ఉండగా.. మరికొందరు అశాస్త్రీయంగా రహదారి విస్తరణ చేపడుతున్నారని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వాస్తవంగా ఇలాంటి పరిస్థితుల్లో ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు.. ఆస్తుల యజమానుల వద్దకు వెళ్లి ఒప్పించే ప్రయత్నం చేయాలి. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. భూసేకరణ మా పరిధిలోని అంశం కాదని ఇంజనీరింగ్ అధికారులు.. 'యజమానులు ఒప్పుకుంటే సేకరిస్తాం.. లేదంటే చట్ట ప్రకారం ముందుకెళ్తామని' పట్టణ ప్రణాళికా విభాగం వ్యవహరిస్తోంది. దీంతో కీలక ప్రాజెక్టుల్లో పురోగతి లేకుండా పోయింది. ఖాజాగూడ, ఐఐఐటీ జంక్షన్, అంజయ్య నగర్, సైబరాబాద్ కమిషనర్ ఆఫీస్ నుంచి గచ్చిబౌలి జంక్షన్ రహదారి విస్తరణదీ అదే దుస్థితి. ఉన్నతస్థాయిలో అండదండలున్నాయని చెప్పుకునే కొందరు అధికారులు.. ప్రాజెక్టులు చేపట్టినా, లేకున్నా అడిగేవారు ఎవరు అన్న ధీమాలో ఉండడమే ఇందుకు ప్రధాన కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఏజెన్సీలు ఎంపిక చేసినా పనులు ప్రారంభం కాని ప్రాజెక్టులు

- కేబీఆర్ పార్కు చుట్టూ జంక్షన్లలో వంతెనలు అండర్‌పాస్‌లు- రూ.1090 కోట్లు
- ఖాజాగూడ, ఐఐఐటీ జంక్షన్, అంజయ్యనగర్, గచ్చిబౌలి రోడ్డు విస్తరణ- రూ.749 కోట్లు
- అమీన్‌పూర్ రోడ్డు విస్తరణ - రూ.49 కోట్లు
- ఎన్ఎఫ్‌సీఎల్, టీవీ- జంక్షన్ - రూ.368 కోట్లు

పారా మెడికల్ విద్యార్థి ఆత్మహత్య



అనిల్‌కుమార్ మృతదేహం

హయత్‌నగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థి హాస్టల్‌లో ఫ్యానుకు ఉరేసుకుని మృతిచెందాడు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట్ మండలం, చిల్లపల్లి గ్రామానికి చెందిన రాయిని అనిల్‌కుమార్ (21) సామనగర్ రోడ్డు నంబర్ 10లో ఉన్న బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంటూ హయత్‌నగర్‌లోని డీఎంఐటీ విజయ రీసెర్చ్ ఆఫ్ పారా మెడికల్ లేబరేటర్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం హాస్టల్‌లో ఎవరూ లేని సమయంలో అనిల్‌కుమార్ ఫ్యానుకు వైరుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారంలో నష్టాలతో మరొకరు..



సతీష్ కుమార్(ఫైల్)

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో నష్టాలు రావడంతో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. రాంనగర్ గుండు ప్రాంతానికి చెందిన సారారపు సతీష్ కుమార్(46) చేపల వ్యాపారి. తాను చేసే వ్యాపారంలో తీవ్రంగా నష్టాలు రావడంతో నిరాశకు గురయ్యాడు. ఈనెల 24న సాయంత్రం మహబుబాబాద్ నుంచి ఇంటర్‌సిటీ రైలులో చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో దిగాడు. పట్టాల వెంట కొదిదూరం వెళ్లి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురికి తరలించారు.

వాడవాడలా బతుకమ్మ సంబురం


రాజేంద్రనగర్ వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న వ్యవసాయ శాఖ అధికారులు నిర్మల, పద్మ, స్పందన, శిరీష, సునీత, సత్యరాణి, మహేశ్వరి, మాధవి, శివానంద, ఎస్ యాదయ్య ముదిరాజ్

- రాజేంద్రనగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి)


జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో గురువారం జరిగిన బతుకమ్మ సంబరాలను జల్‌పల్లి మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి జి.వెంకట్ నారాయణ, ప్రారంభించారు. జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్‌రామ్, మున్సిపాలిటీ మహిళ ఉద్యోగులు, మహిళా సంఘాల నాయకులు బతుకమ్మ ఆడారు.

- పహాడిషరీఫ్ సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి)


తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జరుగుతున్న బతుకమ్మ వేడుకలు ఐదో రోజు ఉత్సాహంగా జరిగాయి. తెలంగాణ మున్నూరుకాపు మహిళలు, క్లిక్ సంస్థ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయ వేషధారణలో బతుకమ్మ ఆడారు. ఈకార్యక్రమానికి సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఏనుగు నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు అభినందనలు తెలిపారు.

- రవీంద్రభారతి, (ఆంధ్రజ్యోతి)


పేట్ల బురుజు ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ జయ ఆధ్వర్యంలో బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు ఆర్ఎంఓ అమృత లక్ష్మి, ఆఫీస్ సూపరింటెండెంట్ జయ ప్రకాష్, వేణు గోపాల్, తదితరులు

- చార్మినార్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి)

బతుకమ్మ కొలను ఏర్పాటు


సొంత నిధులతో బతుకమ్మ కొలను నిర్మించిన భక్తురాలు గద్దె పద్మ

రాజేంద్రనగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మైలార్‌దేవపల్లి డివిజన్ మార్కండేయనగర్ బస్తీలో బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి భక్తులు ఇబ్బంది పడుతుండడంతో మహిళా భక్తురాలు గద్దె పద్మ సొంత డబ్బుతో కొలను ఏర్పాటు చేశారు. గురువారం వీరాంజనేయ స్వామి ఆలయ అధ్యక్షుడు ఈ కొలన్ను ప్రారంభించారు. గద్దె పద్మను బస్తీ వాసులు అభినందించారు.


ఎల్‌బీ స్టేడియంలో తెలంగాణ క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి సతీమణి వాకిటి లలితా శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జేయేస్ రంజన్ సతీమణి డాక్టర్ రుచి జేయేష్ రంజన్, స్పోర్ట్స్ అథార్టి ఛైర్మన్ శివ శేనారెడ్డి సతీమణి హర్షశ్రీ శివశేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీ బాలాదేవి

- బర్కత్‌పుర,(ఆంధ్రజ్యోతి)

దుర్గామాతకు పూజలు

దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా గురువారం రాజేంద్రనగర్, చాంద్రాయణగుట్ట, అఫ్జల్‌గజ్ డివిజన్లలోని ఆలయాలతో పాటు పలు మండపాల్లో దుర్గామాతకు పూజలు జరిగాయి. ఆయా మండపాల్లో జరిగిన పూజల్లో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

- రాజేంద్రనగర్, చాంద్రాయణగుట్ట,అఫ్జల్‌గజ్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి)


లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు అడికె రాజు, సందానంద నాగేశ్, రవిశంకర్, వీరేశం మురారి


మాంగళ్య ధారణ(పసుపు తాడు) రూపంలో కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిస్తున్న జమ్మిచెట్టు దుర్గామాత అమ్మవారు


ఎలుగంధ బస్తీలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో పూజలు చేసిన గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను శాలువాతో సన్మానిస్తున్న నిర్వాహకులు ప్రతాప్, చింటు, మహేశ్, శ్రీనివాస్


కుష్మాండదేవిగా వెండి చీరలో భక్తులకు దర్శనమిస్తున్న లాల్‌దర్వాజ సింహవాహినీ మహంకాళీ అమ్మవారు


ద్రౌపది గార్డెన్‌లో నితిన్ సింగ్, గోపాల్ సింగ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మాతా విశాల్ జాగరణ్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ గోషామహల్ నియోజకవర్గ నాయకులు ఆల పురుషోత్తం రావు, కార్పొరేటర్ శశికళ, నాయకులు కృష్ణ

తెలంగాణ భాషా సౌందర్యం గొప్పది


పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

అఫ్జల్‌గంజ్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాషా, సాహిత్యాల సౌందర్యం అత్యంత గొప్పదని తెలంగాణ రాష్ట్ర ప్రజాళిక సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి అధ్వర్యంలో ఆచార్య గంట, జలందర్ రెడ్డి సంపాదకత్వంలో వెలువడిన తెలంగాణ భాష సమగ్ర పరిశీలన ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వెయ్యి ఏళ్ల తెలంగాణ సాహిత్యంలో ఆనాటి పాల్కూరికి మొదలు ఈనాటి ఆధునిక కవుల వరకు ఎంతో మంది సాహితీ వేత్తలు భాషా సాహితాలను సుసంపన్నం చేస్తూ వచ్చారన్నారు. ఆచార్య గంటా జలందర్ రెడ్డి చేస్తున్న సాహిత్ సేవ, గొప్పదన్నారు. కృతి స్వీకర్త, తెలంగాణ విధాన పరిషత్తు చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ, అనేక ఉద్యమాల ఫలితమే ఈనాటి తెలంగాణ అస్తిత్వమ్మె భాషా సాహిత్యాలను కాపాడుకుంటూ మరింత భవిష్యత్తులో భావి తరాలకు అందించాలన్నారు. ప్రముఖకవి, తెలంగాణ రాష్ట్ర కాళోజి పురస్కార గ్రహీత అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్తు కార్యదరి డా.జె.చెన్నయ్య, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచలకులు వెనుగు నరసింహరెడ్డి, పొరెడ్డి రంగయ్య, సంస్థ సభ్యులు కురాకుల భరత, అజయ్ యాదవ, బానోతు శివాజీ, ఏవీ కళాశాల ఎక్.సి.సి. విద్యార్థులు, ప్రముఖ సాహితీ వేత్తలు, భాషాభిమానులు పాల్గన్నారు.

ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న ఎరుకల ప్రదేశ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ

బర్కత్‌పుర, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో వెనుకబడిన ఎరుకల జాతీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎరుకల ప్రదేశ్ ఎరుకల సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు కెంబసారం కృష్ణ డిమాండ్ చేశారు. ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ. 500 కోట్ల నిధులను కేటాయించాలని ఆయన కోరారు. గురువారం బషీర్‌బాగ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్టీ రిజర్వేషన్‌లు పూర్తిస్థాయిలో అమలు కావడంలేదని, దీంతో అన్ని రంగాల్లో నష్టపోతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్‌లు అమలు అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎరుకల సంక్షేమ భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండు కోట్ల రూపాయలకు ప్రొసీడింగ్ అందించడం హర్షనీయమన్నారు. సమావేశంలో సంఘ్ రాష్ట్ర కోశాధికారి కూరాకుల విజయ్ కుమార్, దేవర యాదగిరి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కూతాడి శివరాజ్, కట్టా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో స్వచ్ఛ భారత్


స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న జవాన్లు, విద్యార్థులు

చార్మినార్, సెప్టంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఆర్‌పీఎఫ్ సౌత్‌జోన్ ఎస్‌డీజీ ప్రధాన కార్యాలయం అధికారి ఐజీపీ ఏ.శ్రీనివాస్ అన్నారు. గురువారం హైదరాబాద్ పాతబస్తీ చాంద్రాయణగుట్ట బార్కాస్ డివిజన్ సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లోని ఎస్‌డీజీ ఆఫీస్ సిబ్బంది ఆధ్వరంలో కేంద్రీయ విద్యాలయ ఆవరణలో స్వచ్ఛభారత్ అభియాన్ నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని చిపురుతో చెత్తను తొలగించారు. స్వచ్ఛత మన సంస్కృతిలో భాగం, ప్రతిఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలిన ఆయన సూచించారు. కార్యక్రమంలో సౌత్‌జోన్ ఎస్‌డీజీ కార్యలయం డీఐజీ పవన్‌కుమార్ బానస్, కమాండెంట్ సుందరం, కమాండెంట్ సోమ్‌నాథ్ మహారాణా, డిప్యూటీ కమాండెంట్ మానికణ్, సహాయ కమాండెంట్ గణేష్‌కుమార్, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ జీపీడీ క్రీస్టి, సీఆర్‌పీఎఫ్ జవాన్లు విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారికి పెద్ద కష్టం

- కంటి సమస్యతో బాధపడుతున్న చిన్నారి
- దాతల సాయం కోసం అర్థిస్తున్న తల్లిదండ్రులు


చికిత్స పొందుతున్న చిన్నారి హర్షిని గౌడ్

రాజేంద్రనగర్/ చార్మినార్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓ చిన్నారి ప్రాణాంతక వ్యాధితో బాధపడుతూ, దాతల సాయం కోసం ఎదురు చూస్తోంది. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలి పురాకు చెందిన రాసరి ప్రశాంత్ గౌడ్ కూతురు హర్షిని గౌడ్ కంటి సంబందిత వ్యాధితో బటర్ పై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. తండ్రి ప్రశాంత్ గౌడ్ చిన్న కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. పాప చికిత్స కోసం ఇప్పటి వరకు రూ. 10 లక్షల ఖర్చు చేశాడు. మధ్య తరగతి కుటుంబం. చికిత్స కోసం మరో పది లక్షలు అవసరమని వైద్యులు చెప్పడంతో సహాయం కోసం ఎదురు చూస్తున్నాడు. దాతలు ముందుకొచ్చి సహాయం చేస్తే మూడు సంవత్సరాల చిన్నారికి ప్రమాదం తప్పుతోందని తండ్రి కోరుతున్నాడు. దయచేసి సమాచారాన్ని పది మందికి తెలిపి పాప ప్రాణాలు కాపాడడానికి దాతలు సహకరించాల్సిందిగా కోరుతున్నాడు. దాతలు ఎవరైనా చిన్నారి తండ్రి ప్రశాంత్ గౌడ్ ఫోన్ నెంబర్ 80742 28166ను సంప్రదించగలరు.

ఉద్యోగుల ఖాతాల్లోనే జీతాలు వేయాలి


మాట్లాడుతున్న ఎండీ రాజ్ మహ్మద్

బర్కత్‌పుర, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి ఉద్యోగుల ఖాతాల్లో నేరుగా జీతాలు వేయాలని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ మైనార్టీస్ ఔట్‌సోర్సింగ్ నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ రాజ్ మహ్మద్, ప్రధాన కార్యదర్శి రేష్మా ఫర్హీన్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్స్ డిప్యూటీ వార్డెన్స్‌కు 12నెలల వేతనం చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో సీనియర్ అసిస్టెంట్స్ డిప్యూటీ వార్డెన్స్ మొదటి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తం గా 265 మంది సీనియర్ అసిస్టెంట్స్, డిప్యూటీ వార్డెన్స్ విధులు నిర్వహిస్తున్నార ని అన్నారు. కేవలం పాఠశాలలో పనిచేసిన 10 నెలలు మాత్రమే జీతాలు ఇస్తున్నారని, అలా కాకుండా 12 నెలల వేతనాలు చెల్లించాలని, ఏడాదికి ఒక ఇంక్రిమెంట్, ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలు పెంచి, ప్రతి నెల 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు మహ్మద్ యాకూబ్ పాషా, షేక్‌జానీపాషా, సుల్తాన్ షాహిన్, కార్యనిర్వాహక కార్యదర్శులు ఇంతియాజ్, రఫీయొద్దీన్ పాల్గొన్నారు.

బీజేపీ గోషామహల్ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా క్రాంతి కిరణ్


బాధ్యతలు స్వీకరిస్తున్న క్రాంతి కిరణ్‌తో జాతీయ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు లాల్‌సింగ్ ఆర్య, కుమార్

అఫ్జల్‌గంజ్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): బీజేపీ గోషామహల్ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా క్రాంతి కిరణ్ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షులు లాల్‌సింగ్ ఆర్య, కార్యదర్శి ఎస్.కుమార్, సెక్రటరీ కొప్పు భాష, భరత్ ప్రసాద్‌తో కలిసి క్రాంతి కిరణ్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో, నాయకులు, వి.అశోక్, కె.శంకర్, ఎం. చంద్రశేఖర్, ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కాలనీలో వారాంతపు సంత వద్దు'

రాజేంద్రనగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ గోల్డెన్ హైట్స్ కాలనీలో వారాంతపు కూరగాయల సంత ఏర్పాటు చేయవద్దని ఆ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు మహ్మద్ అమీనుద్దీన్, మహ్మద్ అబ్దుల్ వకీల్, ఖలీల్ అష్ఫక్, జుల్ఫీ కోరారు. ఇదే విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులతో పాటు జీహెచ్ఎంసీ అధికారులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. కూరగాయల సంత వల్ల వ్యర్థాలు అక్కడే వదిలి వెళ్లడంతో దుర్వాసనకు దోమలు వృద్ధి చెంది అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. డ్రైనేజీ కాలువలలో కూరగాయల వ్యర్థాలు పడి డ్రైనేజీ బ్లాక్ అవుతోందన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. తమ కాలనీలో కూరగాయల వారంతపు సంత వద్దని గోల్డెన్ హైట్స్ కాలనీ వాసులు కోరుతున్నారు.

భూమి పూజ


గౌలిగుడ అశోక్ బజార్‌లోని బిజిలి మహంకాళి ఆలయ ముఖద్వార నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్ భూమి పూజ చేశారు. రూ. 11లక్షలతో ఈ నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్పొరేటర్ శంకర్ యాదవ్, గోవింద్ రాజు, సల్లా అశోక్ యాదవ్, ప్రమోద్‌కుమార్, జెల్లా ప్రసాద్, విజయ్ సారథి, సల్లా దేవేందర్ యాదవ్, జగన్, కాంతం, శంకర్‌లాల్ యాదవ్, సర్వానంద్ తదితరులు పాల్గొన్నారు.

- అఫ్జల్‌గంజ్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి)

ఆలయాల పరిశీలన


ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ నాయకులతో సమావేశమైన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మైలార్‌దేవుపల్లి బలరామక్రిష్ణ భక్త భజన మండలి ఉమ్మడి ఆలయాల కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఆలయాలను పరిశీలించారు. సమావేశంలో ఆలయాల కమిటీ సభ్యులు కృష్ణాయాదవ్, కాశమోని అనిల్ ముదిరాజ్, రావుల భాస్కర్, ప్రతాప్‌రెడ్డి, దేవులపల్లి దాసు, గజ్జల సురేశ్ ముదిరాజ్, వెంకట్‌రెడ్డి, దేవేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


- అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి గ్లోబల్ గ్రీన్‌మెంటర్ 2025 అవార్డును అందుకున్నారని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. వాయిస్ ఆఫ్ ది ప్లానెట్ ప్రదర్శనలో భాగంగా గ్రీన్‌మెంటర్ వ్యవస్థాపకుడు వీరేందర్ రావత్, సత్యా ఎస్ త్రిపాఠి, ప్రొఫెసర్ పాట్రిక్ పాల్ వాల్ప్ ప్రవాస భారతీయురాలు రాధిక చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు.

- బర్కత్‌పుర, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి)

కత్తితో సంచరిస్తున్న వ్యక్తికి 15 రోజుల జైలు


పోలీసుల అదుపులో హుస్సేన్ ఖాన్

చాంద్రాయణగుట్ట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కత్తితో సంచరిస్తున్న వ్యక్తికి న్యాయస్థానం 15 రోజుల జైలు శిక్ష విధించినట్టు ఫలక్‌నుమ ఇన్‌స్పెక్టర్ ఎరుకొండ సీతయ్య తెలిపారు. ఫలక్‌నుమలో హుసేన్ ఖాన్ అనుమానాస్పదంగా సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పోలీసులు గమనించి అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి గురువారం నాంపల్లిలోని 9వ స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ మంద.మురళి నిందితుడికి 15 రోజులు జైలు శిక్ష విధించినట్టు తెలిపారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలి


న్యాయదీక్షలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, మాజీ ఎంపీ హనుమంతరావు, జస్టిస్ చంద్రకుమార్ , న్యాయవాదులు

కవాడిగూడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని, న్యాయవాదులకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను వెంటనే అందజేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ జూనియర్ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల వంశీకృష్ణ ఆధ్వర్యంలో న్యాయదీక్ష నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, జస్టిస్ చంద్రకుమార్ హాజరై దీక్షకు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, జూనియర్‌న్యాయవాదులకు ప్రతినెలా 15వేల స్టైఫండ్ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హనుమంతరావు హామీఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల వంశీకృష్ణ మాట్లాడుతూ, ప్రభుత్వం స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు వేముల రామకృష్ణ, బీసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, న్యాయవాదులు తులసి రామ్, గిరీష్, శ్యామ్, సూర్య, సురేష్‌కుమార్, మహేంద్, నరేష్, నవీన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహమూద్ భాయ్ కన్నుమూత


మహమూద్ భాయ్ మృతదేహంపై కాంగ్రెస్ జెండా కప్పి నివాళులర్పిస్తున్న టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్

రాజేంద్రనగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇంద్రానగర్‌కు చెందిన మహమూద్ భాయ్(70) అనారోగ్యంతో గురువారం తన నివాసంలో కన్నుమూశారు. ఆయన మరణవార్త తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులతో పాటు వివిధ పార్టీల నాయకులు మహమూద్ భాయ్ మృతదేహానికి నివాళులర్పించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సానెం శ్రీనివాస్‌గౌడ్ మహమూద్ భాయ్ మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా హసన్‌నగర్‌లో మహమూద్ భాయ్ పనిచేశారని గుర్తు చేశారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ మైలార్‌దేవుపల్లి డివిజన్ అధ్యక్షుడు ధనుంజయ తదితరులున్నారు.

పంజాబ్ వరద బాధితులకు ఆర్థిక సాయం

హైదరాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పంజాబ్ వరద బాధితుల సహాయార్థం మజ్లిస్ పార్టీ రూ.10 లక్షల విరాళం అందజేసింది. ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (మజ్లిస్)చారిటీ ఎడ్యుకేషనల్ అండ్ రిలీఫ్ ట్రస్ట్ ద్వారా ఇటీవల పంజాబ్‌లో కురిసిన భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా నష్టపోయిన బాధితుల పునరావాస అవసరాల కోసం రూ. పది లక్షలు అందజేసినట్టు మజ్లిస్ పార్టీ నాయకులు తెలియజేశారు.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

రాజేంద్రనగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) మాజీ అధ్యక్షుడు, భారతీయ జన సంఘ్ సిద్దాంత కర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను రాజేంద్రనగర్ సర్కిల్‌లో గురువారం నిర్వహించారు. రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శివరాంపల్లిలో, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సులిగె వెంకటేశ్ ఆధ్వర్యంలో హైదర్‌గూడ లో, మైలార్‌దేవుపల్లి డివిజన్-1 అధ్యక్షుడు జి.పాండు యాదవ్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర కాలనీలో, మైలార్‌దేవుపల్లి డివిజన్-2 అధ్యక్షుడు సూరెడ్డి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో మధుబన్ కాలనీలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆయన సిద్దాంతాలను గుర్తు చేసుకున్నారు. బస్తీలు, కాలనీల్లో మొక్కలు నాటారు. హైదర్‌గూడలో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మైలార్‌దేవుపల్లి, అత్తాపూర్ కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్ రెడ్డి, మోంద్ర సంగీత, బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, కార్యదర్శి ఎం.కొమురయ్య, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ ఎన్ మల్లారెడ్డి, జిల్లా నాయకులు జోగి రవి, అడికె రాజు, పి.మల్లేశ్ యాదవ్, మేకల వనితా దామోదర్‌రెడ్డి, కోరని సదానంద్, ఎస్ వాసు, హరికిషన్ జీ, బండారు బాలక్రిష్ణ, రాహుల్‌రెడ్డి, సరితా రెడ్డి, కె.పద్మావతి, పి.మల్లేశ్ యాదవ్, బొమ్మరాజు నర్సింహ్మా, అడికె మహేందర్ పాల్గొన్నారు.


గౌలిపురా శ్రీరామ్ నగర్ కాలనీలో బీజేపీ గౌలిపురా డివిజన్ అధ్యక్షుడు సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పించి మొక్కలు నాటిన మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, నాయకులు వెంకటేష్, రూప్ రాజ్,రఘుకాంత్, సురేందర్, రవి, సాకేత్

- చాంద్రాయణగుట్ట, (ఆంధ్రజ్యోతి)


శివరాంపల్లిలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు శ్రీధర్, సందీప్ ముదిరాజ్ తదితరులు


హైదర్‌గూడలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ మోంద్ర సంగీత, సులిగె వెంకటేశ్


మధుబన్ కాలనీలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సూరెడ్డి వినయ్‌రెడ్డి, మల్లేశ్ యాదవ్


దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా వెంకటేశ్వర కాలనీలో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, పాండు యాదవ్


బస్తీ బాటలో భాగంగా బైక్‌పై పర్యటిస్తున్న డిస్కం సీఎండీ ముషారఫ్ ఫారూఖీ

కొత్త కనెక్షన్ల దరఖాస్తులను పరిష్కరించండి

అధికారులకు డిస్కం సీఎండీ ఆదేశం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కొత్త విద్యుత్ కనెక్షన్ల దరఖాస్తులను పరిష్కరించాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, ఎండీ ముషారఫ్ ఫారూఖీ అధికారులను ఆదేశించారు. గురువారం టెలిశాన్ రెన్స్‌లో నూతన సర్వీసులు, టైటిల్ ట్రాన్స్‌ఫర్, సోలార్ నెట్‌మీటర్, పీఎం సూర్యఘర్ యోజనలకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న 593 ఎల్‌టీఎం దరఖాస్తులను వెంటనే రిలీజ్ చేయాలని సంబంధిత ఇంజనీర్లను ఆదేశించారు. ఏ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారో ముందుగా లైన్ క్లియరెన్స్ షెడ్యూల్ రూపొందించి ప్రభావిత ప్రాంతాల్లో విని యోగదారులకు తెలియజేయాలని, ఇదే సమయంలో చెట్ల కొమ్మలు తొలగించడం, డీటీఆర్, ఏబీ స్విచ్‌ల మరమ్మతులు చేసేందుకు కొత్త విధానాన్ని ప్రవేశపెట్టినట్లు సీఎండీ తెలిపారు. బస్తీబాటలో భాగంగా గురువారం పాతబస్తీలోని హాస్సేని ఆలం, మొఘల్‌పురా, బెహరూపియా బస్తీ, గోల్కొండ తదితర ప్రాంతాల్లో బైక్‌పై పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి విద్యుత్ సంస్థ పనితీరు ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్) డాక్టర్ నర్సింహులు, మెట్రో జోన్ చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్ పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సీనియర్ సిటిజన్స్‌కు కిట్లు అందజేస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సీనియర్ సిటిజన్స్ కోసం గోల్డెన్ కేర్

● ప్రారంభించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు సమాజానికి మూలస్తంభాలు, జ్ఞానిదులు అని, గోల్డెన్ కేర్ కార్యక్రమం ద్వారా వారికి భద్రత, అత్యవసర సాయం, వైద్య సేవలను అందుబాటులోకి తీసుకు వస్తున్నామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు పేర్కొన్నారు. నేరేడ్‌మెట్ కమిషనరేట్‌లో రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ సహకారంతో 70 ఏళ్లకు పైబడిన వారి కోసం 'గోల్డెన్ కేర్'ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ తల్లిదండ్రులను పట్టించుకోకపోయినా, హింసించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వృద్ధ తల్లిదండ్రులకు పిల్లల నుంచి ఆర్థిక సహాయం అందేలా సహకరిస్తామన్నారు. వృద్ధుల సేవల కోసం హెల్ప్ లైన్ నంబరు 14567 లేదా వాట్సాప్ నంబరు 8712662111లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీలు పద్మజ, ప్రవీణ్‌కుమార్, సునీతారెడ్డి, ఆకాంక్షయాదవ్, ఇందిర, ఉషా విశ్వనాథ్, నాగలక్ష్మి, అరవింద్‌బాబు, రమణారెడ్డి, మనోహర్‌తోపాటు అదనపు డీసీపీలు, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.


సచివాలయం ముట్టడికి వస్తున్న అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు

సచివాలయ ముట్టడికి అంగన్‌వాడీల యత్నం

● అడ్డుకున్న పోలీసులు

ఖైరతాబాద్/కవాడిగూడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన చలో సెక్రటేరియట్ కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. ఇందిరాపార్కు, చౌరస్తా నుంచి సచివాలయం వైపు దూసుకెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఇందిరాపార్కు, సిగ్నల్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. దీంతో పోలీసులు, అంగన్‌వాడీల మధ్య వాగ్వాదం జరగడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పలు జిల్లాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో వచ్చి సచివాలయ ముట్టడికి యత్నించిన అంగన్‌వాడీలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జయలక్ష్మి మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ, పీఎం ప్రీ విద్య పేరుతో ఐదు సంవత్సరాల లోపు పిల్లలను విద్యాశాఖకు అప్పగిస్తూ నిర్ణయించడం సరికాదన్నారు. అంగన్‌వాడీలకు రూ. 18 వేల వేతనంతోపాటు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, 24 రోజుల సమ్మె కాలానికి వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీల అరెస్టు సిగ్గుచేటు : హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం చలో సచివాలయం పిలుపునిచ్చిన అంగన్‌వాడీల పట్ల రేవంత్‌రెడ్డి సర్కార్ పోలీసులను ప్రయోగించి, కర్కశంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామంటూ మీరాలు పలికిన సీఎం రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లను ఎక్కడికక్కడ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడం సిగ్గుచేటని గురువారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే..
రాజకీయంగా పుట్టగతులు లేకుండా చేస్తాం

జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరిక

పంజాగుట్ట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే రాజకీయంగా పుట్టగతులు లేకుండా చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లను పెంచక ముందే రెడ్డి జాగృతి సంఘానికి చెందిన వారు హైకోర్టులో పిటిషన్ వేయడం బాధాకరమన్నారు. బీసీ సంక్షేమ సంఘం, జాతీయ బీసీ దళ్ ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు 60 శాతం ఉన్నప్పటికీ 42 శాతం రిజర్వేషన్లు ప్రభుత్వం కల్పిస్తామంటే అగ్రకులాలు వ్యతిరేకించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 48 గంటల్లోగా రెడ్డి సంఘం వారు సమావేశం నిర్వహించి బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. బీసీలకు అగ్రకులాలు సహకరించకపోతే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని ఉద్యమిస్తామని జాజుల హెచ్చరించారు. సమావేశంలో బీసీ దళ్ అధ్యక్షుడు దండ్రు కుమారస్వామి, ప్రొఫెసర్ భాగయ్య, బీసీ కుల సంఘాల జేఏసీ కోశాధికారి ఉప్పరి శేఖర్ సగర, బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు మురళి మేదర తదితరులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్, దండ్రు కుమారస్వామి, ప్రొఫెసర్ భాగయ్య తదితరులు

కోచింగ్ లేకుండా కష్టపడి చదివి..

● గ్రూప్-1లో ఐదో ర్యాంక్ సాధించిన కృతిక


సిద్దాల కృతిక

సరూర్‌నగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ అధికారికంగా ప్రకటించిన గ్రూప్-1 జాబితాలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడకు చెందిన సిద్దాల కృతిక 5వ ర్యాంక్ సాధించారు. డిప్యూటీ కలెక్టర్ క్యాడర్‌కు సెలెక్ట్ అయ్యారు. త్వరలో ప్రభుత్వం ఓ సభ ఏర్పాటు చేసి అభ్యర్థులకు సీఎం చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందజేయనున్నారు. ఈ సందర్భంగా కృతిక మాట్లాడుతూ తాను ఎంతో కష్టపడి గ్రూప్-1 రాశానని, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎన్నటికీ మరువలేనిది అన్నారు. తమ కుమార్తె కృతిక పడిన శ్రమకు తగ్గ ఫలితం దక్కిందని తల్లిదండ్రులు లావణ్య-బీరప్ప సంతోషం వ్యక్తం చేశారు. ఎటువంటి ఆటంకం లేకుండా ఎలాంటి కోచింగ్ లేకుండా గ్రూప్-4లో 511వ ర్యాంకు సాధించినప్పటికీ దాంతో తృప్తి చెందకుండా ప్రజా సేవ చేయాలనే లక్ష్యంతో గ్రూప్-1 రాసి రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు.

కోచింగ్ లేకుండానే..

కృతిక 2017లో డిగ్రీ(బీఏ) పూర్తి చేసి సివిల్స్‌పై దృష్టి పెట్టారు. వరుసగా నాలుగు సార్లు సివిల్స్‌కు అటెంప్ట్ చేసినా అర్హత సాధించలేక పోయారు. తాజాగా 2024లో గ్రూప్-1 పరీక్ష రాసిన కృతిక 5వ ర్యాంకు దక్కించుకుని తన లక్ష్యాన్ని అందుకున్నారు. గతేడాది గ్రూప్-4 511వ ర్యాంకు సాధించి, ఈ ఏడాది జనవరిలో కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందారు. ఇప్పుడు డిప్యూటీ కలెక్టర్ హోదా పొందనున్నారు.

గ్రూప్-1లో రాకేష్‌కు 606వ ర్యాంక్



హైదర్‌నగర్ : జీవనోపాధి కోసం 25 ఏళ్ల క్రితం మహబూబ్‌నగర్ నుంచి నగరానికి వలస వచ్చిన చిలువేరి రాకేష్ గ్రూప్-1 పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో 606వ ర్యాంకు, బీసీ-ఏ కేటగిరీలో 14వ ర్యాంక్ సాధించాడు. కొల్లాపూర్ తాలూకా కల్వకోల్‌కు చెందిన వెంకటేశ్వర్లు, లక్ష్మి దంపతులు ఆల్విన్ కాలనీలోని మహంకాళి నగర్‌లో ఇస్త్రీ బండి నడుపుతూ కుటుంబాన్ని నడుపుతున్నారు. కాగా, రాకేష్ వచ్చిన ర్యాంకు ఆధారంగా కమర్షియల్ టాక్స్ ఆఫీసర్‌గా ఉద్యోగం లభిస్తుందని తండ్రి వెంకటేశ్వర్లు 'ఆంధ్రజ్యోతి'తో తన ఆనందం వ్యక్తం చేశారు.

500ఏళ్ల నాటి ధన్వంతరి ప్రతిమ

● మహబూబాబాద్ జిల్లాలో గుర్తించిన తెలంగాణ వారసత్వశాఖ అధికారి మల్లు నాయక్



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండల కేంద్రంలోని పాకాలవాగు ఒడ్డున సుమారు 500 ఏళ్ల నాటి ధన్వంతరి శిల్పాన్ని తెలంగాణ వారసత్వ శాఖ అధికారి మల్లు నాయక్ గుర్తించారు. నిలువెత్తు శిల్పం సమపాద స్థానకభంగిమలో పద్మపీఠంపై నిలిచిన ప్రతిమ క్రీశ 14 లేదా 15వ శతాబ్దానికి చెందిన ధన్వంతరిదిగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. శిల్పశైలి ఆధారంగా కాకతీయానంతర కాలానికిచెందిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ వెలుతున్నారు. ఈ అరుదైన శిల్పాన్ని వరంగల్ పురావస్తు ప్రదర్శనశాలలో భద్రపరచాలని కోరారు. ప్రతిమాలక్షణాలను గుర్తించడంలో ఏపీలోని అద్దంకి పట్టణానికి చెందిన బి. మహేష్ సహకారం అందించినట్లు వెల్లడించారు.


స్వర్ణోత్సవ సంబరాలను ప్రారంభిస్తున్న బ్యాంకు చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

టీజీబీలో ఘనంగా స్వర్ణోత్సవ సంబరాలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీబీ)లో స్వర్ణోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లకుంటలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో రక్తదాన, ఉచిత కంటి పరీక్షా శిబిరాలతో పాటు "స్వచ్ఛతా హీ సేవ" కార్యక్రమాలు, బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఫిక్సిడ్ డిపాజిట్లపై అత్యధిక వడ్డీ, తక్కువ వడ్డీకి గృహ రుణాలను ఇస్తున్నామని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం, అగర్వాల్ కంటి ఆస్పత్రి, వాసన్ ఐ కేర్ సహకారంతో వైద్య శిబిరాలు నిర్వహించారు, సుందరయ్య పార్కులో నిర్వహించిన "స్వచ్ఛతా హీ సేవ" కార్యక్రమంలోనూ టీజీబీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దశ.. దిశ మారనున్న మెట్రో

(5వ పేజీ తరువాయి)

రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. ఉప్పల్, మియాపూర్‌లో రెండు మెట్రో డిపోలను నిర్మించారు.

దెబ్బతీసిన కరోనా

2020లో వచ్చిన కరోనా కారణంగా 169 రోజులపాటు మెట్రో రైళ్ల సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో ఎల్‌అండ్‌టీ మెట్రో రైలు సంస్థ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడింది. దీంతో తనకు వచ్చిన నష్టం నుంచి తమను ఆదుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూనే ఉంది. ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడం, ప్రాజెక్టు నిర్మాణం కోసం అప్పట్లో తీసుకున్న రుణాలు, వాటికి చెల్లించాల్సిన వడ్డీతో అప్పుల భారం పెరిగిపోవడంతో సంస్థ ఆర్థికంగా కోలుకోలేకపోయింది. దీంతో తాజాగా జరిగిన చర్చల తర్వాత ప్రాజెక్టును పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించేందుకు ఎల్‌అండ్‌టీ మెట్రో సంస్థ అంగీకరించింది.

రెండో దశకు తొలగిన అడ్డంకులు

మెట్రో భాగస్వామ్యం నుంచి ఎల్‌అండ్‌టీ తప్పుకుంటున్నట్లు సంస్థ అంగీకరించిన నేపథ్యంలో రెండో దశ ప్రాజెక్టుకు సంబంధించిన అడ్డంకులు దాదాపుగా తొలగినట్లు తెలుస్తోంది. అయితే మొదటి విడతలోని మూడు కారిడార్లలో 69.2 కిలోమీటర్ల మేరకు పనులు చేపట్టిన ఎల్‌అండ్‌టీని ఎలా సమన్వయం చేసుకుని ముందుకు సాగుతారు, టికెట్ ఫేరింగ్ ఎలా ఉంటుంది, ఎండ్ టూ ఎండ్ ప్రయాణం సాధ్యమవుతుందా, ప్రయాణికులు రైళ్లను మారాల్సి వస్తుందా.. లేదా.. అనే విషయాలపై కేంద్రం ఇప్పటికీ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే డీపీఆర్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వకుండా ఆపివేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే తాజాగా మొదటి దశ నిర్వహణను కూడా రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టేందుకు సిద్ధమవుతున్న తరుణంలో రెండోదశలోని అనుమానాలకు ఇక ఫుల్‌స్టాప్ పడేందుకు మెట్రో వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే ఇప్పటికే వాటాను ఇవ్వాలని కోరుతున్న ఎల్‌అండ్‌టీ హైటెక్‌సిటీ, రాయదుర్గం, ఎర్రమంజిల్, పంజాగుట్ట, మూసారాంబాగ్‌లో నిర్మించిన మాల్స్ నిర్వహణ తన దగ్గరే పెట్టుకుంటుందా, లేకుంటే రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తిగా ఇస్తుందా.. అనేది చర్చనీయాంశంగా మారింది.

ఎల్‌అండ్‌టీ మెట్రో ఆదాయం, వ్యయాలు

సంవత్సరం	ఆదాయం (₹కోట్లల్లో)	నికర నష్టం (సుమారు ₹కోట్లల్లో)
2017&18	69.53	58.36
2018&19	318.46	148.00
2019&20	598.20	382.00
2020&21 (కరోనా)	227.95	1,766.00
2021&22	475.37	1,745.85
2022&23	682.53	1,315.94
2023&24	1399.31	555.04
2024&25	1108.54	625.88

60ఏళ్ల తర్వాతే అసలైన జీవితం

● హెల్పేజ్ ఇండియా కార్యక్రమంలో వక్తలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అసలైన జీవితం ఆరంభమయ్యేది 60 ఏళ్ల దాటిన తర్వాతేనని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అప్పటి వరకు కుటుంబ బాధ్యతలతో తలమునకలైన వారు ఆరుపదులు దాటాక తమ అభిరుచులకు అనుగుణంగా జీవితాన్ని గడపడానికి వెసులుబాటు దొరుకుతుందని అన్నారు. అంతర్జాతీయ వయోధికుల దినోత్సవం సందర్భంగా 'హెల్పేజ్ ఇండియా' గురువారం తార్నాకలో 'అడ్వాంటేజ్ 60' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధురాలు 98 ఏళ్ల రావూరి మనోరమను శాలువా, జ్ఞాపికతో నిర్వాహకులు సన్మానించారు. నిమ్స్ ఆస్పత్రి వయోధికుల విభాగం వైద్యుడు సత్యనారాయణ రాజు మాట్లాడుతూ వయోధికుల దేశానికి గొప్ప సంపద అని వ్యాఖ్యానించారు. వయోధికులకు అనువైన వాతావరణం సమాజంలో కల్పించాలని భూమిక ఉమెన్స్ హెల్ప్‌లైన్ కొండవీటి సత్యవతి అన్నారు. కార్యక్రమంలో హెల్పేజ్ ఇండియా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల బాధ్యుడు యతేంద్ర యాదవ్, రోజామిస్ట్రీ కళాశాల ప్రిన్సిపాల్ పీజీ సునందమ్మ, ఐఆర్ఎస్ విశ్రాంత అధికారి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.


ముషీరాబాద్‌లో పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీ లక్ష్మణ్, కార్పొరేటర్ సుప్రియా గౌడ్

ప్రధాని మోదీ గొప్ప సంస్కరణవాది

● జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతికి మేలు

● బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్

హైదరాబాద్/ముషీరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ గొప్ప సంస్కరణ వాది అని, ఆయనకు వ్యాపార, పారిశ్రామిక వర్గాలు మద్దతు ఇవ్వాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ కోరారు. జీఎస్టీలో సంస్కరణలతో పేద, మధ్య తరగతి ప్రజానీకానికి, వ్యాపారులకు మేలు జరుగుతుందని అన్నారు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నాయకులు ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ దీనదయాళ్ ప్రవచించిన అంత్యోదయ సిద్ధాంతం ప్రకారం ప్రధాని మోదీ ప్రభుత్వం వెనకబడిన వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. గురువారం ముషీరాబాద్‌లో సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ సుప్రియా గౌడ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఎంపీ లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దు చేయడంలో మోదీ ప్రభుత్వం కీలకంగా వ్యవహరించిందని, వారు ఎప్పుడు జైలుకు వెళతారో తెలియదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. దీనదయాళ్ జయంతి సందర్భంగా గురువారం సిద్దిపేట జిల్లాలో జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు.

రాష్ట్రంలో ఇప్పటి వరకు ఎన్ని విడిదే సంస్థలు పెట్టుబడులకు ముందుకు వచ్చాయో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల్లో బీసీలకు మాత్రమే 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, మతపరమైన రిజర్వేషన్లకు చోటు కల్పించవద్దని డిమాండ్ చేశారు.

ఐక్యతకు చిహ్నంగా మహా చింతచెట్టు

ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్ అధ్యక్షుడు వేదకుమార్


మాట్లాడుతున్న వేదకుమార్

అఫ్జల్‌గంజ్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మూసీలో 1908లో వరదలు వచ్చిన సమయంలో 150 మందిని కాపాడిన మహా చింతచెట్టు స్మృతులు, ఐక్యతకు చిహ్నంగా చారిత్రాత్మకంగా నిలిచిపోయిందని ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్ అధ్యక్షుడు వేదకుమార్ మణికొండ పేర్కొన్నారు. గురువారం ఫోరం ఫర్‌బెటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ డెక్కన్ స్టడీస్, పలు పౌర సమాజ సంస్థల సహకారంతో ఉస్మానియా దవాఖానా ఆవరణలోని చింతచెట్టు ప్రాణదాత్రి వద్ద వార్షిక జ్ఞాపక- ఐక్యత సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్ వశకర్ మూసీ వరదలకు హృద్యమైన లా పని గానంతో 1908లో వచ్చిన వరదలను పాడి వినిపించారు. వేదకుమార్ మాట్లాడుతూ 2008లో ప్రారంభమైన ఈ జ్ఞాపక సభ ప్రతి సంవత్సరం నిర్వహించడం జరుగుతుందన్నారు. హైదరాబాద్ నగర ప్రణాళికలోని నవ్యాన్ని ఎదుర్కొనేందుకు ఏకీకృత మాస్టర్ ప్లాన్ అవసరమన్నారు. కవి సంపత్, ప్రముఖ సినీ దర్శకులు అఫ్సార్, ప్రసిద్ధ సాహితీ వేత్త అంబటి వెంకన్న, బ్రదర్ వర్గీస్, మానవ హక్కుల కార్యకర్త జీవన కుమార్, ఉస్మానియా ఆర్ఎంవో-1 డాక్టర్ జయకృష్ణ, భూగర్భ జల నిపుణుడు సుభాష్ రెడ్డి తదితరులు మూసీ వరదలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈపీటీఆర్ఐ డైరెక్టర్ రామేశ్వరరావు, తెలంగాణ హెరిటేజ్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ నారాయణ పాల్గొన్నారు.

నిన్నటి వరకు ఉద్యోగులు.. నేటినుంచి అధికారులు

(5వ పేజీ తరువాయి)

ఉన్నతాధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. అలాగే టీజీపీఎస్సీ పోస్టుకు పూర్వ విద్యార్థి పత్తిపాటి సందీప్ ఎంపిక కావడం పట్ల వర్సిటీ విద్యార్థులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఎప్పటికైనా ఐఏఎస్ సాధిస్తా

గ్రూప్-1లో ఎంపికైన పోస్టుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. అయితే, ఎప్పటికైనా సివిల్స్(ఐఏఎస్)సర్వీసెస్‌లో ర్యాంకు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. ప్రస్తుతం ఎంపికైన పోస్టులో చేరతాను. ఉద్యోగంలో చేరుతూనే సివిల్స్‌కు ప్రయత్నం కొనసాగిస్తాను. నా ప్రయత్నం ఫలిస్తుంది. తల్లిదండ్రులు (పెంకటేశ్వర్లు, విజయలక్ష్మి) తోడ్పాటే నా విజయానికి కారణం.

- గోపిశెట్టి సుశ్మిత

చదువు, ఉద్యోగం.. అన్నీ జేఎన్‌టీయూలోనే

జేఎన్‌టీయూ జగిత్యాల కాలేజీలో బీటెక్ (ఈఈఈ), హైదరాబాద్ క్యాంపస్‌లో ఎంటెక్ చదివా. యూపీఎస్సీ ప్రయత్నాలు చేస్తూనే గ్రూప్ 4, గ్రూప్ 1 పరీక్షలు రాశా. ముందుగా వచ్చిన జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం జేఎన్‌టీయూలోనే రావడం యాదృచ్ఛికమే. తాజాగా గ్రూప్ 1 ఫలితాలలో రాష్ట్ర ఆడిట్ విభాగంలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఎంపిక కావడం కూడా అలాగే జరిగినట్లుగా అనిపిస్తోంది. పోటీపరీక్షల సమయంలో ఒడిదుడుకులను అధిగమించడంలో అమ్మానాన్నలు శ్రీనివాస్‌రెడ్డి, కవిత, భర్త వెంకటసాయిరెడ్డి (సాఫ్ట్‌వేర్ ఇంజనీర్) ఎంతో స్ఫూర్తిని, సహకారాన్ని అందించారు.

- యరవా కావ్యారెడ్డి



కెనరా బ్యాంక్‌లో హిందీ దివస్

కెనరా బ్యాంక్ సర్కిల్ కార్యాలయంలో హిందీ దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ రుద్రనాథ్ మిశ్రా, జనరల్ మేనేజర్ కళ్యాణ్ ముఖర్జీ, ఏజీఎం సుప్రియా మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి



సెంట్రల్ బ్యాంక్‌లో స్వచ్ఛతా అభియాన్

ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాథ్ పేరుతో సెంట్రల్ బ్యాంక్ జోనల్ కార్యాలయంలో గురువారం స్వచ్ఛతా అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. జోనల్ హెడ్ ధారాసింగ్ నాయక్, రీజనల్ హెడ్ దిలీప్ భరద్వాల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి